సాక్షి
గుంటూరు
మంగళవారం, 4, జూన్, 2024



పంప్‌హౌస్ పరిశీలన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పలు పంప్ హౌస్‌లను కార్పొరేషన్ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ కృష్ణారెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు.



154 మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: తక్కెళ్లపాడు వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో సోమవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరంలో వైద్యాధికారి ఎస్తేరు రాణి 154 మందికి వైద్యపరీక్షలు చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.5700, మోడల్ ధర రూ.5200 వరకు పలికింది.

ఓట్ల పెట్టె పలుకు..!

- ఉత్కంఠకు నేడు తెర
- సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడి
- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- ఏఎన్‌యూలో లెక్కింపు ప్రక్రియ
- మూడు వేల మంది సిబ్బంది నియామకం
- మాక్ కౌంటింగ్ నిర్వహించిన అధికారులు
- సీసీ కెమెరాలు, వీడియో చిత్రీకరణ మధ్య లెక్కింపు
- మధ్యాహ్నానికే ఫలితాల సరళి వెలువడే అవకాశం
- తేలనున్న 162 మంది అభ్యర్థుల భవితవ్యం
- ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం స్ట్రాంగ్ రూం వద్ద పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఏఎన్‌యూకు తరలిస్తున్న అధికారులు



గుంటూరు తూర్పు నియోజకవర్గం స్ట్రాంగ్ రూం వద్ద పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను ఏఎన్‌యూకు తరలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎట్టకేలకు ఓట్ల పెట్టె (ఈవీఎం)లు ఫలితంపై పెదవి విప్పనున్నాయి. అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నాయి. ఫలితంగా 21 రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడనుంది. జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మొదలు కానుంది. దీని కోసం అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలోని 7 అసెంబ్లీ, గుంటూరు పార్లమెంటు స్థానాలకు సంబంధించి ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న 162 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 30 మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 132 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గతనెల 13న పోలింగ్ జరగగా కౌంటింగ్ మంగళవారం జరగనుంది. దీంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. శనివారం విడుదలైన ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీ గెలుపును ఖాయం చేశాయి. దీంతో ప్రతిపక్ష కూటమి అభ్యర్థులు నిద్రలేని రాత్రులు గడిపారు.

ఎక్కడెక్కడ ఏ నియోజకవర్గం లెక్కింపు అంటే..!

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కాలేజీ విభాగంలో తాడికొండ, సివిల్ అండ్ మెకానికల్ విభాగంలో మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, ఫర్మల్ సైన్స్ ల్యాబ్ బ్లాక్‌లో పొన్నూరు, ఈసీఈ, ఈఈఈ బ్లాక్‌లో గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సెంట్రల్ బ్లాక్‌లో 14 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. కేవలం ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలో 1,075 మంది ఉద్యోగులను వినియోగిస్తున్నారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియకు దాదాపు మూడు వేల మందిని నియమించారు. గుంటూరు పార్లమెంట్‌కు 23,663 పోస్టల్ బ్యాలెట్లు, 507 సర్వీస్ ఓట్లు పోలవగా, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 23,678 పోస్టల్ ఓట్లు, 609 సర్వీస్ ఓట్లు వచ్చాయి.

తొలుత పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీల్‌ను తొలుత అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తొలగిస్తారు. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. వీరితో మాక్ కౌంటింగ్ నిర్వహించారు. నియోజకవర్గాలు కేటాయించిన సిబ్బందికి మంగళవారం ఉదయం 5 గంటలకు ర్యాండం పద్ధతిలో టేబుళ్లను కేటాయిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ప్రతి టేబుల్‌కు అభ్యర్థులు ఒక ఏజెంట్‌ను నియమించుకున్నారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. గుర్తింపు కార్డు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు.

2,500 మందితో బందోబస్తు

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 2,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రబలగాల పహారా, సీసీ కెమెరాలు, వీడియో చిత్రీకరణ మధ్య సాగనుంది. మంగళవారం మధ్యాహ్నానికి ఫలితాల సరళి వెలువడే అవకాశం ఉంది. గుర్తింపు కార్డులు ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు అనుమతించరు. శాంతి భద్రతలకు సంబంధించి జిల్లాలో 115 పికెట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. 70 మొబైల్ పార్టీలు, 56 చెక్ పోస్టులు , 28 క్యూఆర్టీ టీంలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సు, స్ట్రైకింగ్ ఫోర్సు, రిజర్వు ఫోర్సులను సిద్ధం చేశారు. గుంటూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీలను తనిఖీలు చేస్తున్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించారు.

న్యూస్‌రీల్

హద్దు మీరితే రౌడీషీట్

డీఐజీ గోపీనాథ్



పెదకూరపాడు: కౌటింగ్ సమయంలో అల్లరి మూకలు హద్దుమిరితే రౌడీషీట్‌తోపాటు కేసులు నమోదు చేస్తామని డీఐజీ జెట్టి గోపీనాథ్ అన్నారు. పెదకూరపాడు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం సీఐ మంగరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు పెదకూరపాడు సర్కిల్ పరిధిలో 18 కేసులు నమోదు చేసి 150 మందిని అరెస్టు చేసి బైండోవర్ చేశామని, బైండోవర్ చేసిన వారు అల్లర్లకు పాల్పడితే రూ.2లక్షలు జరిమానాతోపాటు 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి మండలంలో నాలుగు మొబైల్ టీంలు తిరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. వారి వెంట ఎస్ఐ వెంకట్రావు ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక అడిషనల్ ఎస్పీ పర్యటన

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అమలవుతున్న 144 సెక్షన్‌లో భాగంగా సోమవారం పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో సందర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గ శాంతిభద్రతల ప్రత్యేక పర్యవేక్షణాధికారి, అడిషనల్ ఎస్పీ డీవై రమణమూర్తి, సీఐ రామకృష్ణ, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్‌తో కలిసి విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. కొత్తపాలెం, కొండవీడు, కోట, చెంఘీజ్‌ఖాన్‌పేట, సంగం గోపాలపురం, బోయపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వ్యాపార దుకాణాలు మూతపడ్డాయా లేదా తనిఖీలు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు ఎవరూ బయట తిరగరాదని, అనవసరమైన అల్లర్లకు పాల్పడరాదంటూ గ్రామీణులకు అవగాహన కల్పించారు.

నేలబావిలో పడి బాలుడు మృతి



మృతుడు గ్రంధి ఆనంద్

రాజుపాలెం: ఆరేళ్ల బాలుడు వ్యవసాయ నేల బావిలో పడి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లిలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు వ్యవసాయం సాగు చేసేందుకు తన పొలంలో 20 అడుగుల నేలబావి తవ్వించాడు. ఈ బావి గ్రామానికి అతి సమీపంలో 100 అడుగుల దూరంలో ఉంది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు రోజు ఆ బావిలో ఈత కొడుతుంటారు. బావి సమీపంలోనే విద్యార్థులు క్రికెట్ ఆడుతుంటారు. బావి సమీపంలో చర్చికూడా ఉంది. గ్రామానికి చెందిన గ్రంధి ఆంజనేయులు, సుజాత దంపతులకు కుమారుడు ఆనంద్(6), కుమార్తె ఉన్నారు. ఆనంద్ పిల్లలతో ఆడుకుంటూ వచ్చి ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బావిలో దిగి ఆనంద్‌ను బయటకు తీశారు. అప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు గుర్తించారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చుటకు ఎవ్వరివల్ల కావడంలేదు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

దుర్గమ్మకు రూ.3.48 కోట్ల ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.48 కోట్లను కానుకలు, మొక్కుబడులు, ముడుపులను రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను సోమవారం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 18 రోజులకు రూ.3,48,33,515 నగదు, 535 గ్రాముల బంగారం, 7.840 కిలోల వెండి లభ్యమయ్యాయని ఆలయ అధికారులు తెలిపారు. విదేశాలకు చెందిన భక్తులు అమ్మవారికి భారీగానే కానుకలను సమర్పించారు. 601 యూఎస్‌ఏ డాలర్లు, 100 ఓమన్ బైసాలు, 132 యూఏఈ రియాల్స్‌లతో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆన్‌లైన్‌లో ఈ-హుండీ ద్వారా రూ.1.31 లక్షలను సమర్పించారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు



జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం(గుంటూరు): సోషల్ మీడియా, వాట్సాప్‌ల్లో ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు పోస్టులు పంపరాదని, ఒక వేళ అలాంటి సందేశాలు పంపిస్తే గ్రూప్ అడ్మిన్లు పూర్తి బాధ్యత వహించాలని ఎస్పీ తుషార్ డూడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎవరైనా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ చట్టం అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు గుంపులు ఉండొద్దని సూచించారు. ఎవరైనా గుంపులుగా ఉన్నట్టయితే చట్ట ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు.

సగటు వర్షపాతం 35.6 మి.మీ.

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 94.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 7.4 మి.మీ. వర్షం పడింది. సగటున 35.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 81.4 మి.మీ., పెదనందిపాడు 73.6, పెదకాకాని 62.6, కాకుమాను 51.6, తుళ్ళూరు 42.6, పొన్నూరు 39.8, తాడికొండ 39.2, గుంటూరు పశ్చిమ 38.2, వట్టిచెరుకూరు 32.4, గుంటూరు తూర్పు 21.2, తెనాలి 11, మేడికొండూరు 10.4, ఫిరంగిపురం 10, మంగళగిరి 9, దుగ్గిరాల 8.6, కొల్లిపర మండలంలో 7.6 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ 3వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 9.7 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 35.7 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ధరావతు... ప్రజాదరణకు గుర్తు

- అదో ప్రతిష్టాత్మక ప్రక్రియగా స్వతంత్రుల భావన
- పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో 107 మంది అభ్యర్థులు పోటీ

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం రానే వచ్చేసింది. గెలుపోటములపై అందరి దృష్టి ఉండగా, స్వతంత్రులు, చిన్నాచితకా పార్టీల తరపున బరిలో ఉన్న అభ్యర్థులు మాత్రం డిపాజిట్లు దక్కుతాయా లేదా అనే ఆందోళనలో ఉన్నారు. ఎందుకంటే వారిపై ఉన్న ప్రజాదరణకు సూచిక కాబట్టి. వచ్చిన ఫలితాన్ని బట్టి భవిష్యత్తులో ప్రధాన పార్టీలు వారిని చేర్చుకునేందుకు ప్రాధాన్యం కనబరుస్తాయి. అందుకే కొందరు స్వతంత్రులుగా పోటీ చేసి ప్రజాబలం నిరూపించుకునే ప్రయత్నం చేస్తుంటారు.

బరిలో 107 మంది అభ్యర్థులు..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 107 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోటీ వైఎస్సార్ సీపీ, ఎన్డీఏ కూటమి మధ్యనే కొనసాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు 14 మందిని పక్కన పెడితే మిగిలిన 93 మంది స్వతంత్రులు, చిన్న చిన్న పార్టీల తరపున పోటీ చేసినవారే. వీరిలో ఎందరికీ డిపాజిట్ వస్తుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశం.

ఇలా పరిగణలోకి తీసుకుంటారు..

ఓట్ల లెక్కింపు సమయంలో నోటాకు పడినవి, పోస్టల్ ఓట్లలో చెల్లకుండా పోయినవి తొలగిస్తారు. ఆ తరువాత చెల్లుబాటు అయిన వాటిల్లో 1/6 వంతు సాధించిన వారికి డిపాజిట్ దక్కినట్లుగా గుర్తిస్తారు. ఇంతకంటే తక్కువ సాధించిన వారి డిపాజిట్‌ను తిరిగి చెల్లించరు. ఎన్నికల్లో గెలిచిన వారికి, 1/6 వంతు కన్నా అధికంగా ఓట్లు వచ్చిన వారికి మాత్రమే డిపాజిట్ మొత్తం తిరిగి ఇస్తారు.

సొమ్ము ప్రధానం కాదు..

డిపాజిట్ గల్లంతైతే ఆర్థికంగా జరిగే నష్టం పెద్దగా ఉండదు. కానీ అదో ప్రతిష్టాత్మక ప్రక్రియగా భావిస్తారు. నామినేషన్ వేసే సమయంలో జనరల్ అభ్యర్థులు అయితే డిపాజిట్‌గా రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.ఐదు వేలు చెల్లించాలి. ఎన్నికల సంఘానికి చెల్లించిన ఆ డిపాజిట్ తిరిగి రాబట్టుకోవడమే ఇక్కడ అత్యంత ప్రతిష్టాత్మకం. భవిష్యత్ రాజకీయాల్లో నాయకుడిగా ఎదిగేందుకు దోహదకారిగా ఉంటుంది. ప్రధాన పార్టీలో కాకుండా బరిలో నిలిచిన 93 మందిలో ఎంత మందికి డిపాజిట్ వస్తుందో చూడాలి మరి.

అనుక్షణం అప్రమత్తత అవసరం

- అల్లర్లు జరిగితే అధికారులే బాధ్యులు
- కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి



బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి

బాపట్లటౌన్: కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంతవరకు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. సోమవారం సాయంత్రం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తొలుత కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా తీసుకున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన భద్రత, కంట్రోల్ రూమ్‌లో తీసుకున్న జాగ్రత్తలు, అభ్యర్థులు, ఏజెంట్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి మాట్లాడుతూ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్కరు వ్యవహరించినా, వెంటనే బయటకు పంపించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగటానికి వీల్లేదన్నారు. ఏవైనా ఘటనలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి సిబ్బందిపై వేటు తప్పదన్నారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అత్యంత వేగంగా స్పందించాలని సున్నితమైన అంశాలైనప్పటికీ త్వరితగతిన అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉన్నప్పుడే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్నారు. ఐజీ వెంట ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా



ప్రమాదంలో పల్టీ కొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



ప్రమాదంలో మృతి చెందిన మహిళ దివ్య

- ఒకరు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- 19 మందికి స్వల్ప గాయాలు

నరసరావుపేటరూరల్: రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టింది. మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం గంగావతి నుంచి యానంకు తులసీ ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి 39 మంది ప్రయాణికులతో బయలుదేరింది. తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం సమీపంలోకి బస్సు చేరుకున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గత రాత్రి కురిసిన వర్షానికి చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. వేగంగా బస్సును నడుపుతున్న డ్రైవర్ రోడ్డుపై అడ్డుగా పడిఉన్న చెట్టు కొమ్మలను గమనించి వాటిని తప్పించే ప్రయత్నంలో ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. బస్సు అదుపుతప్పి పక్కకు పల్టీకొట్టి చెట్టును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన నిమ్మగడ్డ దివ్య(35) బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్‌తో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో 19 మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులపై హత్యాయత్నం

- ఓ కొడుకు ఘాతుకం
- ఆస్తి కోసం భార్యతో కలిసి రాడ్డుతో దాడి
- గుంటూరు నగరంలో ఘటన
- జీజీహెచ్‌లో చేరిన బాధితులు





జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మోహన్‌రావు, నేత్రావతి

గుంటూరు ఈస్ట్: ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులనే కడతేర్చాలని చూశాడు ఓ కొడుకు. భార్యతో కలిసి తండ్రి, మారు తల్లిపై అత్యంత కిరాతకంగా రాడ్డు, సుత్తితో దాడిచేశాడు. వారిని తీవ్రంగా గాయపరిచాడు. ప్రాణభయంతో ఆ తల్లిదండ్రులు కాళ్ల మీద పడి వేడుకున్నా కనికరించలేదు. ప్రస్తుతం బాధితులు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుంటూరు నగరంలో ఈ హృదయ విదారక ఘటన జరిగింది. బాధితురాలు నేత్రావతి కథనం ప్రకారం లక్ష్మీనగర్‌లో నివసించే వేమన మోహనరావు భార్యతో విడిపోయాడు. తన కుమారుడు శ్రవంత్‌కుమార్‌కు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడే నేత్రావతిని రెండో పెళ్లి చేసుకున్నాడు. నేత్రావతికి పిల్లలు పుట్టలేదు. శ్రవంత్‌కుమార్‌ను ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. మోహన్‌రావు లారీ డ్రైవర్. పెద్ద అయిన తరువాత కుమారుడికి వరుసగా మూడు లారీలు కొనిపెట్టాడు. అయితే శ్రవంత్‌కుమార్ నష్టాలు వచ్చి వాటిని అమ్మేశాడు. మోహన్‌రావుకు రెండు ఇళ్లు ఉండటంతో ఒక ఇంటిని భార్య నేత్రావతి పేరు మీద రాశాడు. శ్రవంత్‌కుమార్ పెళ్లయిన రెండేళ్ల తరువాత నుంచి రెండు ఇళ్లు తన పేరు మీద రాయాలని తల్లిదండ్రులతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో కోడలు రాజేశ్వరి అత్తమామలను తరుచూ వేధిస్తోంది. గతంలో ఆస్తి రాయలేదనే అక్కసుతో మామ తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించింది. అయినా మోహన్‌రావు కుమారుడి కుటుంబానికి తరచూ ఆర్థిక సహాయం చేస్తూ వచ్చాడు. రెండు లారీలు అమ్మి వేసినా మూడో లారీ కొనిపించాడు. ఆరు నెలల క్రితం మనవరాలు అనారోగ్యానికి గురైతే కుమారుడికి రూ.2 లక్షలు ఇచ్చాడు. ఇటీవల మనవరాలు పదో తరగతి పుస్తకాలు కొనుగోలు చేసేందుకు రూ.10 వేలు వెచ్చించాడు. అయినా శ్రవంత్‌కుమార్ భార్యతో కలిసి తరచూ తండ్రి, మారు తల్లితో గొడవలు పడుతూ ఉన్నాడు. ఎట్టకేలకు శ్రవంత్‌కుమార్, అతని భార్య రాజేశ్వరి మెహన్‌రావు, నేత్రావతిని హతమార్చేందుకు పథకం వేశారు. సోమవారం మోహన్‌రావు డ్యూటీ నుంచి వచ్చి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కొడుకు, కోడలు ఇద్దరూ రాడ్డు, సుత్తిలతో ఇంట్లోకి వచ్చారు.

కళ్లల్లో కారం చల్లి..

తొలుత మోహన్‌రావు, నేత్రావతి కళ్లల్లో కారం చల్లారు. అనంతరం శ్రవంత్‌కుమార్ రాడ్డుతో పలుమార్లు మోహన్‌రావు తలపై తీవ్రంగా మోదాడు. కొడుకు కాళ్లు పట్టుకుని చంపవద్దంటూ మోహన్‌రావు ప్రాధేయపడ్డా వారు కనికరించలేదు. రాజేశ్వరి తన అత్త నేత్రావతి తలపై సుత్తితో పలు మార్లు మోదింది. దంపతుల కేకలు విన్న స్థానికులు వచ్చి చూసి సమీపంలో ఉన్న ఏఎస్సై పద్మావతికి చెప్పారు. పద్మావతి తన బంధువులతో కలిసి వచ్చి శ్రవంత్‌కుమార్, రాజేశ్వరిని నిలువరించారు. కొద్దిసేపటికి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మోహన్‌రావు, నేత్రావతిలను 108 అంబులెన్సు ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కేఎల్‌యూలో ఎన్‌సీసీ శిబిరం



గన్ ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ 22వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో వార్షిక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరం కమాండెంట్ కల్నల్ జె.మహేష్ మాట్లాడారు. క్యాడెట్లలో స్ఫూర్తిని నింపారు. గన్‌ఫైరింగ్, వాల్ డ్రిల్, క్రీడలు, ఆయుధాల వాడకం, మ్యాప్ రీడింగ్, గార్డ్ ఆఫ్ హానర్, రాజ్యపత్, కర్తవ్యపత్ వంటి పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా నుంచి 700 మంది క్యాడెట్లు శిక్షణకు హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కుర్రా రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, కేఎల్‌యూ 22 ఆంధ్ర ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ వి.మౌనిక, డెప్యూటీ కమాండ్ లెఫ్టినెంట్ గణేష్, సుబేదార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఏపీ ముఖ్యమంత్రి జగనే

మాచర్ల: పేద, బడుగు, గిరిజన, మైనార్టీ వర్గాలను నిత్యం ఆదుకుంటూ ఐదు సంవత్సరాలు వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కల్లా ఎన్నికల ఫలితాలు విడుదల కాగానే త్వరలోనే మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని గిరిజన ప్రజా సమైఖ్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులకు ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఎగ్జిట్‌పోల్స్‌ను తమ కనుకూలంగా ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. ప్రజలకు మంచి చేసిన వారే తమ రాష్ట్ర సీఎంగా ఉండాలని జగన్‌కు మరోసారి ఆంధ్రులు పట్టం కట్టారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఇక దుష్ప్రచారాన్ని ఆపి ప్రజల అభిమానంతో కాబోయే సీఎం జగన్ పరిపాలనను మరొకసారి చూడాలన్నారు.

డీ ఫార్మసీ.. ఉపాధికి భేష్

- పేద, మధ్య తరగతి విద్యార్థినులకు వరం
- నూరు శాతం ప్లేస్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్
- గుంటూరులో ప్రభుత్వ రంగ ఏకైక మహిళా పాలిటెక్నిక్
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు



గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు తక్కువ వ్యవధిలో తమ కాళ్లపై తాము నిలబడేలా డీ.ఫార్మసీ కోర్సు భరోసా ఇస్తోంది. పాలిటెక్నిక్ విద్యలో ఒక బ్రాంచ్‌గా ఉన్న డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీ ఫార్మసీ) కోర్సును రెండేళ్ల కాల పరిమితితో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించింది. ఫార్మసీ రంగంలో ఉన్నతంగా స్థిరపడేందుకు మొదటి మెట్టుగా ఇది ఉపయోగపడుతుంది. తరగతి గదిలో పాఠ్యాంశాల ఆధారిత విజ్ఞానంతోపాటు క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచుకునే విధంగా కోర్సుకు రూపకల్పన చేశారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు (జోన్ 3) ప్రత్యేకించి బాలికల కోసం డీ ఫార్మసీ కోర్సును గుంటూరు నగరం గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అందిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజు మినహాయింపుతో పాటు ఉపకార వేతనం పొందేందుకు అవకాశం ఉంది. ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలి. వెబ్‌సైట్ అడ్రస్‌లు https://apsbtet.ap.gov.in, https://apbtet.in/pharmacy. ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని బోధనా వసతులు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం ఉంది.

పాఠ్యాంశాలు

డీ ఫార్మసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఆరు సబ్జెక్టులు చొప్పున ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఔషధాలను తయారు చేయటం, మానవ శరీర అవయవాలపై అవి పని చేసే విధానం, ఔషధ మొక్కలు, ఫార్మసీ చట్టాలు, ఫార్మసిస్టుగా డ్రగ్ డిస్పెన్సింగ్, పేషెంట్ కౌన్సెలింగ్‌పై అవగాహన కలిగిస్తారు.

విద్యార్హత

ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ రెగ్యులర్‌తోపాటు దూరవిద్య ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులకు ఇంటర్ మార్కులు ఆధారంగా ర్యాంకులను కేటాయించి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలను కల్పిస్తారు.

ఉపాధి అవకాశాలు

డీ ఫార్మసీ పూర్తి చేసిన వెంటనే విస్తృత రీతిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని కమ్యూనిటీ ఫార్మాసిస్ట్, హాస్పిటల్ ఫార్మాసిస్ట్, మార్కెటింగ్ డ్రగ్ రిప్రజెంటేటివ్‌గా ఫార్మాసిస్టు ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఔషధ దుకాణాల్లో రిటైల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలను అందిపుచ్చుకోవచ్చు. ఆర్థిక స్తోమత ఉంటే సొంతంగా ఔషధ దుకాణం ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతూ మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చు. పరిశ్రమలు, రైల్వే ఆసుపత్రిలో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రంగంలో వేతనాలు అధికంగా ఉన్నందున ఎక్కడైనా ఉపాధికి భరోసా ఉంటుంది. డీ ఫార్మసీ కోర్సు చదివిన తర్వాత ఉన్నత చదువులకు ఈసెట్ ద్వారా బీ ఫార్మసీ రెండో ఏడాదిలోకి ప్రవేశం పొందవచ్చు.

> **నూరు శాతం ఉపాధి**
>
> గత విద్యాసంవత్సరంలో కళాశాల నుంచి డీ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు నూరు శాతం ఉద్యోగావకాశాలను కల్పించాం. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు పంపడంలో సహాయం అందిస్తాం. ప్రవేశాల సమాచారానికి 9848038769, 9959324563, 9492806556 నంబర్లలో సంప్రదించాలి.
>
> – ఎస్.ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపాల్

క్రాకర్స్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ జయరామరాజు, డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్



పెదనందిపాడులో స్వాధీనం చేసుకున్న బాణసంచా

మేడికొండూరు: మందపాడు గ్రామంలో సోమవారం రూ.70 వేలు విలువ చేసే పలు రకాల క్రాకర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు నియోజకవర్గ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి సీఐడీ అడిషనల్ ఎస్పీ సి.జయరామరాజు మీడియాకు వివరాలు తెలిపారు. మందపాడు గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారుడు సయ్యద్ అమీర్‌బాషాను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని రాజరాజేశ్వరి క్రాకర్స్ విక్రయషాపు నుంచి రోడ్డు మార్గంలో కారులో తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉండటంతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్, ఎస్సై వాసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజ్ కుమార్ చెప్పారు. పెదనందిపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో సైదా బాజీ అనే వ్యక్తి నివాసంలో బాణసంచా నిల్వ చేశారనే సమాచారం రావడంతో సోమవారం ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించి సుమారు లక్షా 33 వేల రూపాయల విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకుని బాజీపై కేసు నమోదు చేశారు.

నాట్స్ అధ్యక్షునిగా బాపయ్య చౌదరి సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



బాపును సత్కరించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కన్న మాస్టారు, బాపు తల్లిదండ్రులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామంలో జన్మించి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షునిగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా నూతి బాపయ్యచౌదరి (బాపు) అనతి కాలంలోనే ఘన కీర్తి గడించారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రశంసించారు. నాట్స్ అధ్యక్షునిగా రెండేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించి, పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నూతి బాపయ్య చౌదరిని సోమవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ భాషే రమ్యం-సేవే గమ్యం నినాదంతో రెండేళ్లుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని విద్యార్థులు, మహిళలు వృద్ధుల కోసం ఇతోధికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ నాట్స్ అధ్యక్షునిగా బాపు తన తర్వాత వచ్చే అధ్యక్షునికి సేవల ద్వారా లక్ష్యాలను నిర్దేశించారని, మాతృభూమి రుణం తీర్చుకునే అవకాశాన్ని ఇచ్చిన ఆయన తల్లిదండ్రుల కీర్తి జిల్లా చరిత్రలో నిలిచిపోతోందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ బాపయ్య సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జనచైతన్యవేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ముద్దన నాగరాజ కుమారి, పారిశ్రామికవేత్తలు రాఘవయ్య, శేషగిరిరావు, జీఎస్ఆర్, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక, ప్రతినిధులతో పాటు కాకుమాను నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాస్, ప్రజా గాయకుడు పీవీ రమణ, బాపు తల్లిదండ్రులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

20 మంది చిన్నారులకు కోత, కుట్టులేని చికిత్స



వేడుకల్లో చిన్నారులతో డాక్టర్ రమణ యశశ్వి, డాక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి ఆర్థో పెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశశ్వి రమణ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ ఫుట్ దినోత్సవాలు ఆర్థోపెడిక్ ఓపీ వైద్య విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది క్లబ్ ఫుట్ పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన చికిత్సలు కోత, కుట్లు లేకుండా ఉచితంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ రమణ యశశ్వి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్లబ్ ఫుట్ దినోత్సవం జరిపి వంకర పోయిన కాళ్ళు, పాదాలను కోత, కుట్టు లేకుండా సరిచేసే చికిత్స అందించడం అభినందనీయమన్నారు. జన్యు లోపం వల్ల కొంత మంది చిన్నారులు వంకర కాళ్లతో పుడతారన్నారు. గ్రామాల్లో వంకర కాళ్లతో పుట్టిన చిన్నారులను క్యూర్ ఇండియా సంస్థ గుర్తించి జీజీహెచ్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వి.వి.నారాయణ, డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు, డాక్టర్ సింధూర, డాక్టర్ సుస్మిత, డాక్టర్ శ్రీకాంత్, సుబ్బరాయన్, క్యూర్ ఇండియా ప్రతినిధి శిరీష, టీనా పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలు విద్యార్థుల్లో మేధాశక్తితోపాటు పోటీతత్వాన్ని పెంచుతాయని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. రెండు రోజులుగా నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన చెస్ పోటీలు తమ కళాశాలలో జరపటం సంతోషకరమన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ ఇటీవల భారతదేశానికి చెందిన 17ఏళ్ల యువకుడు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికై దేశానికేకాకుండా ప్రపంచం మొత్తానికి ఐకాన్‌గా నిలిచాడని తెలిపారు. అనంతరం జరిగిన పోటీల్లో మొత్తం 7 రౌండ్లలో 6.5 పాయింట్లు సాధించిన చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన పి.వెంకటరమణ విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో కుషల్, తృతీయ స్థానంలో అఫ్రిదిఖాన్, నాలుగవ స్థానంలో రవికుమార్, ఐదవ స్థానంలో శ్రావణి నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఏపీ పొందింది. విజేతలకు లక్ష పదివేల రూపాయల పోత్సాహక బహుమతులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు, సంయుక్త కార్యదర్శి అహ్మద్‌అనిస్, చలపతి ఫార్మసీ కళాశాల పీడీ భానుప్రకాష్, జిల్లా చెస్ చాంపియన్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.గోపినాథ్, ఎం.సుమలత, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ విజయ్ అగర్వాల్, హుస్సేన్, రామలక్ష్మణ్, చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు విజేతలను అభినందించారు.

8 నుంచి తెలుగు రాష్ట్రాలస్థాయి నాటికల పోటీలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన సంస్థ నిర్వాహకులు

పొన్నూరు: ప్రముఖ రంగస్థల నటులు నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 8,9,10 తేదీలలో 23వ ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పోటీలు నిర్వహించనున్న నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికలో కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 8న రాత్రి 7 గంటలకు ఇంద్రప్రస్థం నాటిక, కౌసల్య సుప్రజా రామ నాటిక, సత్యహరిశ్చంద్ర కాటి సీను, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, 9న రాత్రి 7 గంటలకు రైతేరాజు, శాస్త్రీయ నృత్యం, బంధం నాటిక, జానపద నృత్యం, ఏడున్నాడో ఎక్కడున్నాడో నాటిక, 10న రాత్రి 7.30 గంటలకు నాలోన నీవే నాటిక, విద్యార్థులచే అభ్యుదయ గీతాలు, అనంతరం క్షేత్రం నాటిక ప్రదర్శన ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నన్నపనేని రఘునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్.శివకుమార్, కోటేశ్వరరావు, కార్యదర్శి సిహెచ్.వి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలల వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రముఖులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో 25 రోజుల పాటు తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి రాష్ట్ర గ్రంథాలయ సంఘ కార్యదర్శి డాక్టర్ రావి శారద ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషికి పుస్తకానికి మించిన స్నేహితుడు ఉండడని అన్నారు. అందరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు రోజూ కనీసం 10 నిమిషాలైనా పుస్తకాన్ని చదివేలా అలవాటు చేయాలని అన్నారు. పిల్లలను లైబ్రరీలకు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ తాడేపల్లి అధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు తదితరులు మాట్లాడారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన వెస్ట్రన్, సోలో పాటలకు నృత్యాలు, క్లాసికల్ డ్యాన్సులు అందరినీ అలరించాయి. అనంతరం శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ మిత్ర బృందం తరుపున యడ్ల బాలకృష్ణ, మ్యాథ్స్ లెక్చరర్ ఎస్. లెనిన్‌బాబు, వై. అచ్యుతరావు, వేసవి శిక్షణ శిబిరం నిర్వాహకులు సంధ్యారాణి, రమ్య, కళ్యాణి, డ్యాన్స్ మాస్టర్ చందు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై పోలీసుల అత్యుత్సాహం

- అర్ధరాత్రి దౌర్జన్యం ఆపై కేసు నమోదు

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బాధితుని కథనం ప్రకారం.. గుంటూరు నగరం స్వర్ణభారతి నగర్ 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యకర్త బాజీపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సైదా, హెడ్ కానిస్టేబుల్ సైదా, సీఐ నరేష్‌కుమార్ మరికొంతమంది ఆదివారం రాత్రి సమయంలో దౌర్జన్యం చేశారు. అది చాలక పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడనే నెపంతో బాజీని అదుపులోకి తీసుకుని అతి దారుణంగా కొట్టారు. చిత్రహింసలకు గురిచేశారు. కాళ్ళతో తన్ని, కర్రలతో వీపుపై దాడిచేసి చంపేస్తామని బెదిరించారు. తీవ్రగాయాలైన బాజీని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళి వైద్యులతో కుమ్మక్కై ఎటువంటి గాయాలు లేవని రిపోర్ట్‌లు సృష్టించేందుకు యత్నించారని బాధితుడు ఆరోపించాడు. బాధితుడు తనకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధపడుతుండగా విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ బాజీని పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధితుడికి న్యాయం చేయాలని హైకోర్టు న్యాయవాది తానికొండ చిరంజీవికి బాధ్యత అప్పగించారు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచగా బాధితుడి తరఫున చిరంజీవి వాదించారు. పోలీసుల దురుసు ప్రవర్తనపై కోర్టుకు నివేదించారు. దీంతో న్యాయమూర్తి బాధితుడికి చికిత్స ఇప్పించి సమగ్ర మెడికల్ రిపోర్టులతో తిరిగి కోర్టులో ప్రవేశపెట్టాలని ఆదేశించారని చిరంజీవి వెల్లడించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఏపీసీపీఎస్ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్

నిజాంపట్నం: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఏపీసీపీఎస్ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ సంజీవనగర్‌లో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీమోహన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉండటంతో పాటు పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. 20 రోజులుగా ప్రీమియర్ లీగ్-16 మ్యాచ్‌లు జరిగినట్లు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో శారదానగర్‌కు చెందిన సిహెచ్ గోపీ టీమ్ విజయం సాధించగా, రన్నరప్‌గా సంజీవనగర్‌కు చెందిన సిహెచ్ వెంకటేశ్వరరావు జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు యువశక్తి ఫౌండేషన్ అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కన్నా నాగబాబు తెలిపారు. అదేవిదంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సిహెచ్ గోపికి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మోపిదేవి వెంకట్రావుకు, బెస్ట్ బౌలర్‌గా మోపిదేవి గోపికి బహుమతులు అందించారు.

రైల్వే పరికరాల చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రైల్వే అధికారులు

తెనాలి రూరల్: రైలు పట్టాల మరమ్మతులు చేపట్టే యంత్రానికి సంబంధించిన పరికరాలను చోరీ చేసిన వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను ఆర్‌పీఎఫ్ పోలీసులు సోమవారం తెలిపారు. తెనాలి రైల్వే స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా పట్టాల మరమ్మతులు జరుగుతున్నాయి. పట్టాల కింద ఉండే కంకర రాళ్లను జల్లెడ పట్టి మట్టి, రాళ్ల పొడిని వేరు చేసి కంకరను పట్టాల కింద 30 సెంటీమీటర్ల లోతు వరకు వేసే యంత్రానికి సంబంధించిన చైను స్ప్రాకెట్లు, ఐరన్ బ్లాకులను రైల్వే సిబ్బంది ఇక్కడి మారిస్‌పేట మొండి గోడల వద్ద ఉంచుతున్నారు. మే 24వ తేదీ అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు ఈ పరికరాలను అపహరించుకెళ్లారు. 25న తెల్లవారుజామున గుర్తించిన సిబ్బంది రైల్వే అధికారులకు సమాచారం అందించారు. చోరీ ఘటనపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు అధికారులు ఫిర్యాదు చేశారు. రైల్వే క్రైమ్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ, తెనాలి ఇన్‌స్పెక్టర్ ఖలీల్, ఎస్ఐ ఎం. శ్రీనివాస్, ఏఎస్ఐ శివరామకృష్ణ తమ బృందంతో కేసు దర్యాప్తు చేపట్టారు. స్థానిక సీబీఎన్ కాలనీకి చెందిన గరికె గోపయ్య అలియాస్ గోపి మరికొంత మందితో కలసి చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో గుర్తించారు. చోరీ చేసిన సొత్తును చేబ్రోలుకు చెందిన కె. శరత్ బాబు, గుంటూరుకు చెందిన పి.రవికుమార్‌లకు విక్రయించారు. వీరు ముగ్గురిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.లక్ష విలువైన సొత్తును స్వాధీనపర్చుకున్నట్టు ఆర్‌పీఎఫ్ సిబ్బంది తెలిపారు. నిందితులను విజయవాడలోని రైల్వే కోర్టులో హాజరుపరచగా ఈ నెల 14 వరకు రిమాండ్ విధించినట్టు చెప్పారు. గోపికి సహకరించిన మరి కొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

పశ్చిమ గోదావరిపై కృష్ణా జట్టు విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్రా సెంట్రల్ జోన్ అండర్-19 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణాజిల్లా జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పశ్చిమగోదావరి జట్టు 36 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్‌నాగకుమార్ 98బంతుల్లో 69, చరణ్‌సాయితేజా 61బంతుల్లో 40 పరుగులు సాధించారు. కృష్ణాజిల్లా బౌలర్ సాయిప్రకాష్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 28 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులతో విజయం సాధించింది. కృష్ణా జిల్లా బ్యాట్స్‌మెన్ సోహన్ 39, ఖాజామొహిద్దీన్ 34 పరుగులు సాధించారు. పశ్చిమ గోదావరి జట్టు బౌలర్లు అశ్వంత్, చరణ్‌సాయితేజా 2 వికెట్లు చొప్పున సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.